సాక్షి
సూర్యాపేట
సోమవారం | 8 | ఏప్రిల్ | 2024



గ్యారంటీ కార్డు పేదలకు వరం

కాంగ్రెస్ గ్యారంటీ కార్డు పేదలకు వరమని రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. - 10లో



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రిలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. - 10లో



న్యూస్‌రీల్

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

సూర్యాపేట టౌన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలో మొత్తం 10 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. 6వ తరగతి ప్రవేశాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగలిన సీట్ల ప్రవేశానికి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 1,846 మంది విద్యార్థులకు 1,332 మంది హాజరు కాగా 514 మంది గైర్హాజరయ్యారు. 6వ తరగతికి 1,201 మందికి 831 మంది హాజరు కాగా 370 మంది గైర్హాజరయ్యారు. అలాగే 7వ తరగతికి 249 మందికి 199 మంది హాజరు కాగా 50 మంది గైర్హాజరు కాగా 8వ తరతికి 195 మందికి 151 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారు. 9వ తరగతికి 159 మందికి 125 మంది హాజరు కాగా 34 మంది గైర్హాజరు కాగా పదో తరగతికి 42 మందికి 26 మంది హాజరు కాగా 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ అశోక్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీనయ్య పర్యవేక్షించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు వారు చెప్పారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం జరిపారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు పూర్తిచేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవామనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం

చౌటుప్పల్: శ్రీక్రోధినామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మోటె సత్తయ్య సాహిత్యసేవ – 2024 పురస్కారం అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్నందుకుగాను పురస్కారానికి ఎంపికయ్యారు. జిల్లా రచయితల సంఘం, భువన భారతి సంస్థ సంయుక్తంగా ఆదివారం భువనగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సిలర్ ఎన్.గోపి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం పోరెడ్డి రంగయ్య, భువనభారతి అధ్యక్షుడు గద్దె నర్సింహారెడ్డి, జయశ్రీ, హరగోపాల్, కోమటిరెడ్డి మాధవరెడ్డి, కిషోర్, భాస్కర్, శ్రీరాములు, రవి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో బీజేపీ ప్రభుత్వం విఫలం

చౌటుప్పల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. చౌటుప్పల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు అనేక హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. వాటిని అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. బీజేపీ తీసుకువచ్చిన నల్ల చట్టాల కారణంగా ఎంతో మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో వేలాది కోట్ల రూపాయలను దండుకున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గుణపాఠం చెప్పాలని, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు బండారు నర్సింహ, ఎండీ పాష, దండ అరుణ్‌కుమార్, గోపగోని లక్ష్మణ్, యా.శ్రీనివాస్, అవ్వారు రామేశ్వరి, ఆకుల ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులకు విరామం

- ఎన్నికల డ్యూటీ నుంచి 'ఎస్ఎస్‌టీ'లు తాత్కాలికంగా వెనక్కి
- 18వ తేదీ వరకు మళ్లీ కార్యాలయాల విధులకు..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పోలింగ్‌కు ఎక్కువ సమయం ఉండడమే కారణం



తనిఖీ చేస్తున్న ఎస్ఎస్‌టీ సభ్యులు (ఫైల్)

జిల్లాలో బృందాల వివరాలు

నియోజకవర్గం	ఎస్ఎస్‌టీ	ఎఫ్ఎస్‌టీ	వీఎస్‌టీ	వీవీటి
హుజూర్‌నగర్	3	3	1	1
కోదాడ	3	3	1	1
సూర్యాపేట	3	3	1	1
తుంగతుర్తి	3	3	1	1
మొత్తం	12	12	4	4

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో డబ్బు ప్రభావాన్ని తగ్గించడానికి కేంద్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. జిల్లాలోని సరిహద్దుల్లో ఎస్ఎస్‌టీ (స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం)లను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం తరలింపు.. నిల్వలపై నిఘా పెంచింది. జిల్లాలో మార్చి 17నుంచి ఒక్కో బృందంలో నలుగురు అధికారుల చొప్పున మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసే వరకు సమయం ఎక్కువగా ఉండడంతో ఈనెల 18వ తేదీ వరకు వీరికి తాత్కాలిక విరామం ఇస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు వెలువరించింది. దీంతో ఎస్ఎస్‌టీ విధుల్లో ఉన్న అధికారులు కార్యాలయాల విధులకు వెళ్తున్నారు.

సిబ్బంది కొరతతో..

ఎస్ఎస్‌టీ బృందాల్లో పోలీస్ శాఖ అధికారులే కాకుండా నీటి పారుదలశాఖ, ఆర్అండ్ బీ సహా పలు శాఖల అధికారులకు విధులు అప్పగించారు. వాహనాల తనిఖీ సమయంలో పోలీసులతో పాటు వీరి పర్యవేక్షణ సైతం ఉంటుంది. ఇప్పటికే ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. దీనికితోడు ఇప్పటికే కొందరికి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా.. ధాన్యం కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ అధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉన్న ఉద్యోగులంతా అదనపు విధుల్లోకి వెళ్లడంతో ఆయా శాఖల్లో జరగాల్సిన పనులన్నీ పెండింగ్ పడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడిన ఏప్రిల్ 18 నుంచి పోలింగ్ జరిగే మే 13 వరకు చాలా సమయం ఉండడంతో ఆయా శాఖల్లోని సేవలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

పోలీసుల విధులు యథాతథం

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ జిల్లా వ్యాప్తంగా పెద్ద మొత్తంలో నగదు, మద్యం, కానుకలు పట్టుబడ్డాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాల సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక పోలీస్ బృందాలను విధుల్లో పెట్టారు. వీరు 24/7 విధుల్లో ఉంటున్నారు. జిల్లా యంత్రాంగం నుంచి అందే సమాచారంతో వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. వీరితో పాటు గ్రామాల్లో ఎఫ్ఎస్‌టీ, వీడియో సర్వేలెన్స్ బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచే జిల్లా వ్యాప్తంగా భారీగా నగదు, మద్యం పట్టుబడుతోంది. ఇక ప్రకటన వెలువడి తర్వాత నుంచి ప్రచారం.. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ప్రలోభాల పర్వం పెద్దమొత్తంలో జరగనుంది. ఈ నేపథ్యంలో ఎస్ఎస్‌టీ బృందాలను నియమించి ప్రస్తుతం తాత్కాలిక విరామం ఇచ్చినప్పటికీ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద మాత్రం పోలీసులు విధులు యథాతథంగా కొనసాగనున్నాయి.

కేసీఆర్ పాపాల వల్లే కరువు

- చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలి
- రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జాజిరెడ్డిగూడెంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార ర్యాలీ ప్రారంభం



ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని బైక్‌పై కూర్చోబెట్టుకొని అర్వపల్లి మీదుగా అడివెంలకు ర్యాలీగా వెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి

అర్వపల్లి: మాజీ సీఎం కేసీఆర్ పాపాల వల్లే రాష్ట్రంలో కరువు ఏర్పడిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఆదివారం జాజిరెడ్డిగూడెంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మంత్రి వెంకట్‌రెడ్డి తన బైక్‌పై కిరణ్‌కుమార్‌రెడ్డిని కూర్చోబెట్టుకొని మూసీనది బ్రిడ్జి నుంచి అర్వపల్లి మీదుగా అడివెంల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అడివెంల గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమావేశంలో మంత్రి ప్రసంగించారు. కాంగ్రెస్ కార్యకర్తలు మరో నెల రోజుల పాటు ఇంటింటికీ తిరుగుతూ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో మందుల సామేల్‌కు 50 వేల ఓట్ల మెజార్టీ ఎలా ఇచ్చారో.. ఎంపీ అభ్యర్థికి కూడా 70 వేల మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. చామలను గెలిపిస్తే 5 ఏళ్లు అండగా ఉంటామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.52 కోట్లు మంజూరు చేశానని, లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రత్యేకంగా రోడ్ల కోసం మరో రూ.150 కోట్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అడివెంల గ్రామానికి ప్రత్యేకంగా తన కోటా నుంచి 200 ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో కష్టించి పనిచేసేవారికి న్యాయం జరుగుతుందని.. అందుకు నిదర్శనం చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌కి కూడా త్వరలో తగిన న్యాయం జరుగుతుందన్నారు. రేఖ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆ ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, డాక్టర్ బోయలపల్లి రేఖ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, ఇటికాల చిరంజీవి, సామ అభిషేక్‌రెడ్డి, పర్రెపాటి యుగంధర్, నిద్ర సంపత్, మాజీ జెడ్పీటీసీ కె.అవిలయ్య, బైరబోయిన మహారాజు, అలువాల వెంకటస్వామి, రాహుల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అడివెంలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్లకు టోకెన్ విధానం

- సూర్యాపేట మార్కెట్లో 10వ తేదీ నుంచి అమలు
- ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ కమిటీ నిర్ణయం



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యం (ఫైల్)

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇకపై టోకెన్ విధానం అమలులోకి రానుంది. బుధవారం నుంచి యార్డుకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులు తప్పనిసరిగా టోకెన్ తీసుకోవాలని, అప్పుడే ధాన్యాన్ని మార్కెట్లోకి అనుమతించాలని మార్కెట్ కమిటీ నిర్ణయించింది. సీజన్‌లో రోజుకు 25 వేల బస్తాలకు మించి ధాన్యం వచ్చే క్రమంలో క్రయవిక్రయాలు సక్రమంగా జరగడం, ఎగుమతుల నిమిత్తం మార్కెట్ కమిటీ ఈ టోకెన్ విధానాన్ని అమలు చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే శనివారం రికార్డ్ స్థాయిలో 58వేల బస్తాల ధాన్యం వచ్చింది. దీంతో కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టోకెన్ విధానాన్ని అమలు చేయనున్నారు.

ఎగుమతులు సక్రమంగా జరిగేందుకే..

ఏటా టోకెన్లు జారీ చేసే సమయంలో రోజుకు 35వేల నుంచి 40 వేల బస్తాల చొప్పున మార్కెట్‌లోకి ధాన్యం వచ్చేది. టోకెన్ విధానం కారణంగా ఈ ధాన్యం 25 వేల నుంచి 30 వేల వరకు మాత్రమే మార్కెట్లోకి అనుమతిస్తున్నారు. దీంతో క్రయవిక్రయాలు ఎగుమతులు సజావుగా జరిగేవి. తద్వారా మరుసటి రోజుకు కూడా 25వేల నుంచి 30 వేల బస్తాల ధాన్యం మార్కెట్‌కు వచ్చేది. అయితే ప్రస్తుత సీజన్‌లో సెలవులు అధికంగా ఉండడంతో టోకెన్ విధానం ఎంతవరకు సత్ఫలితాలు ఇస్తుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సూర్యాపేట మార్కెట్‌కు వస్తున్న ధాన్యంలో అధిక శాతం సన్నరకాలే ఉంటున్నాయి. ఈ ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో అమ్ముకునే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో మూడు నాలుగు రోజుల పాటు పోసిన ధాన్యాన్ని రైతులు ఎక్కడ అమ్ముకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

యాదాద్రి ఉద్యోగుల అంతర్గత బదిలీ

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయ ఉద్యోగుల్లో పలువురిని అంతర్గతంగా బదిలీ చేశారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్నదాన సత్రం, వ్రత మండపం, వాహన పూజలు, కొండ కింద వసతి గదులు, శానిటేషన్, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, కొండపైకి వాహనాల ప్రవేశ రుసుం, ఆర్టీసీ బస్సుల నిర్వాహణ చూస్తున్న ఏఈఓ జె.కృష్ణ ప్రధానాలయం, శివాలయం, శాశ్వత పూజలు, డోనర్ సెల్, ప్రచార శాఖకు బదిలీ అయ్యారు. ప్రధానాలయం, శివాలయం, శాశ్వత పూజలు, డోనర్ సెల్, ప్రచార శాఖ బాధ్యతలు చూస్తున్న ఏఈఓ జి.రఘును అన్నదానం, వ్రత మండపం, వాహన పూజలు, కొండ కింద వసతి గదులు, శానిటేషన్, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, కొండపైకి వాహనాల ప్రవేశ రుసుం, ఆర్టీసీ బస్సుల నిర్వాహణకు బదిలీ చేసినట్లు ఈఓ ఉత్తర్వులో పేర్కొన్నారు.

పాతగుట్ట బాధ్యతలు జూనియర్ అసిస్టెంట్‌కు..

జూనియర్ అసిస్టెంట్ ఎం.ఆగారెడ్డి ప్రస్తుత విధులతో పాటు అదనంగా పాతగుట్ట ఆలయం, పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ పరిశీలన విధులు నిర్వహించవలసి ఉంటుంది. బదిలీ అయిన అధికారులు తమకు కేటాయించిన విధుల్లో చేరుతూ జాయినింగ్ రిపోర్టు, చార్జి లిస్ట్ ఈఓ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.



యాదాద్రి ప్రధానాలయం

మాదిగలను విస్మరించిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

- మంద కృష్ణమాదిగ

మిర్యాలగూడ : తెలంగాణ ఎంపీ టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలను పూర్తిగా విస్మరించిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మాదిగలు ప్రధాన శత్రువుగా పరిగణించాలని, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలన్నారు. బీసీలు సైతం కాంగ్రెస్ పార్టీని ప్రథమ శత్రువుగా భావించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో మాదిగలు లేనట్లుగా భావించిన కాంగ్రెస్ రిజర్వేషన్ ఉన్న మూడు స్థానాలను సైతం మాలలకు కేటాయించి మాదిగలను మోసం చేసిందన్నారు. తన రాజకీయ ఎదుగుదలకు మాదిగలే కారణమన్న సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగలపై ఏమాత్రం కృతజ్ఞతా భావం లేదన్నారు. తెలంగాణలో బీజేపీ రెండు స్థానాలను మాదిగలకు కేటాయించిందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలను మోసం చేస్తున్నాయని, నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా చేసేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణలో మాదిగలు బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మచ్చ కొండలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సూర్యాపేట టౌన్: తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రభుత్వం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకు తీసుకోవాల్సిన చర్యలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని, రాబోయే రోజుల్లో జీరో స్థాయికి వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 2023–24 డైస్ గణాంకాల ప్రకారం ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో 23వేలు కాగా ప్రైవేట్ పాఠశాలల్లో 36వేల మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. నన్నెబోయిన సోమయ్య అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేఏ మంగ, ఆర్.ధనమూర్తి, పి.శ్రీనివాస్‌రెడ్డి, అరుణభారతి, దామోదర్, పాపిరెడ్డి, నాగేశ్వర్‌రావు, రమేష్, సాంబయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ చాన్స్

వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు హోం ఓటింగ్‌కు అవకాశం

- పోలింగ్‌కు మూడ్రోజుల ముందే ఓటు వేయించేలా చర్యలు
- 12–డీ ఫారాలు అందజేస్తున్న బూత్ లెవల్ అధికారులు



ఫారం 12-డీ అందజేస్తున్న బీఎల్ఓ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల్లోనూ వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. గత శాసనసభ ఎన్నికల్లో 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు, 40 శాతం మించి వైకల్యం ఉన్న దివ్యాంగులకు హోం ఓటింగ్‌కు ఈ అవకాశం కల్పించింది. ఈసారి వృద్ధుల విషయంలో వయోపరిమితిని 85 ఏళ్లకు పెంచింది. కొందరు వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇలాంటి వారు ఓటుకు దూరం కాకుండా వారి ఇంటి వద్దకే ఎన్నికల సిబ్బంది వెళ్లి ఓటు వేయించేలా చర్యలు చేపట్టింది. ఇందుకు 12–డీ ఫారం పూరించాల్సి ఉంటుంది. వీటిని బీఎల్ఓలు వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి వెళ్లి అందజేస్తున్నారు. ఈ నెల 22 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు సన్నద్ధమవుతున్నారు. తర్వాత పోలింగ్ మూడు రోజుల ముందు వీరితో ఓటు వేయించేలా ఎన్నికల సిబ్బంది చర్యలు తీసుకుంటారు.

100 శాతం ఓటింగ్ దిశగా..

జిల్లాలో రెండులోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. వీరికి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి వద్ద ఓటింగ్ నిర్వహిస్తే 98 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి 100శాతం ఓటింగ్ నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బీఎల్ఓలు ఫారం 12–డీని దివ్యాంగులు, వృద్ధులకు అందించి, దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

దరఖాస్తు ఫారాలు పంపిణీ చేస్తున్నారు



వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి వద్ద ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. బీఎల్ఓలు 12–డీ ఫారాలు వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేస్తున్నారు. వాటిని పూరించాక తిరిగి సేకరిస్తారు. ఎన్నికల సిబ్బంది అక్కడికే వెళ్లి ఓటు వేయిస్తారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– వెంకటరావు, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	దివ్యాంగులు	వయోవృద్ధులు
హుజూర్‌నగర్	5,215	1,348
కోదాడ	5,045	1,396
సూర్యాపేట	3,146	1,361
తుంగతుర్తి	3,789	1,540
మొత్తం	17,195	5,645

22,840 మంది ఓటర్లు

జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నాలుగు నియోజకవర్గాల్లో 85 ఏళ్లు పైబడిన వృద్ధ ఓటర్లు 5,645 మంది ఉండగా, 40 శాతానికి పైబడి వైకల్యం కలిగిన దివ్యాంగ ఓటర్లు 17,195తో కలిపి మొత్తం 22,840 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికీ బీఎల్ఓలు ఫారం 12–డీ దరఖాస్తు ఫారాలు అందజేస్తున్నారు. వీరికి పోలింగ్‌కు మూడు రోజుల ముందు ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఇందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో ముగ్గురు అధికారులతో పాటు వీడియో గ్రాఫర్, మైక్రో అబ్జర్వర్, పోలీసు సిబ్బంది ఉంటారు. ఈ బృందాలు తమకు కేటాయించిన తేదీల్లో ఓటర్ల ఇంటి వద్దకు వెళ్తారు. అక్కడే కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటు వేయిస్తారు. ఈ ప్రక్రియంతా వీడియోలో చిత్రీకరిస్తారు.

వైభవంగా సంపూర్ణ హోమం



సూర్యాపేటలోని భగవద్గీత మందిరంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

భానుపురి (సూర్యాపేట): జిల్లా కేంద్రంలోని శ్రీభగవద్గీత మందిరంలో వాసవీమాత సేవాసమితి అధ్యక్షుడు ఈగ దయాకర్ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి మాత లక్ష పారాయణంతోపాటు శ్రీ సంతోషిమాత కోటి జపం, సంపూర్ణ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఇరువంటి శివరామకష్ణ శర్మ, శివజగన్నాథ శర్మలు శ్రీ వాసవీమాత ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. గణపతి పూజ, సామూహిక లలిత, వాసవీమాత పారాయణాలు చేపట్టారు. కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ దంపతులు, మందిరం నిర్వహకులు మొరిశెట్టి రామ్మూర్తి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాశెట్టి అనంత రాములు, బండారు రాజా, వాసవీభవన్ అధ్యక్షుడు తోట శ్యాం ప్రసాద్, నూక వెంకటేశ్‌గుప్తా, మురళీధర్, ఈగ వెంకటేశ్వర్లు, రాచర్ల వెంకటేశ్వరరావు, మిర్యాల శివకుమార్, సురేష్, సంపత్ కుమార్, రాజు, పావనికృపాకర్, శ్రీధర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదానికి కారణమైన లారీ

చిలుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం చిలుకూరు గ్రామ పరిధిలోని కవితా జూనియర్ కళాశాల వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టాటా ఏస్ డ్రైవర్ ఆదినారాయణ(45) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడుది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పిడుగురాళ్ల దగ్గర జానపహాడ్ గ్రామం. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: చిట్యాల పట్టణంలో బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం జరిగిన పేలుడులో తీవ్రంగా గాయపడిన నిర్వాహకుడు కోటేశ్వరరావు(65) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ డి.సైదాబాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన కోటేశ్వరరావు కొంత కాలంగా చిట్యాలలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో కోటేశ్వరరావుతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోటేశ్వరరావు ఆదివారం మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ఘటనా స్థలంలో గేదె కళేబరం

గరిడేపల్లి: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది.ఈ సంఘటన గరిడేపలి మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గండు వెంకటి పాడి గేదె మేత కోసం వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

గాయపడిన మహిళ మృతి



లావణ్య (ఫైల్)

సూర్యాపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని మానస నగర్ వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 4వ తేదీన ఆగి ఉన్న లారీని ఆటో తప్పించబోతుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా మరో 11మందికి గురికి గాయాలయ్యాయి.. తీవ్ర గాయాలైన వారిని హైదరాబాద్ తరలించారు. కాగా ఆటో ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బాలెంల సమీపంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కలకోట్ల లావణ్య(26) హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీల్లో నగదు స్వాధీనం

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం దేవరకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.4.84లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఇప్పలపల్లికి చెందిన హన్మంతు వద్ద రూ.లక్షా ఇరవై వేల ఏడు వందలు,వనపర్తి జిల్లాకు చెందిన కుర్మయ్య వద్ద రూ.1.12లక్షలు, నల్లగొండకు చెందిన శంకరయ్య వద్ద రూ.1.2లక్షలు, చందంపేట మండలానికి చెందిన దామెర శ్రీనయ్య వద్ద రూ.50 వేలు, ముధావత్ బాలు వద్ద రూ.50 వేలు,అచ్చంపేటకు చెందిన కోట్ల స్వామి వద్ద మరో రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కొండమల్లేపల్లిలో రూ.2.15లక్షలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పోలీసులు ఆదివారం హైదరాబాద్ రోడ్డులో చేపట్టిన వాహన తనిఖీల్లో ఇద్దరి నుంచి రూ.2.15లక్షల నగదును సీజ్ చేశారు.ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి నుంచి మాల్‌కు వెళ్తున్న నిమ్మ రాజు సత్తయ్య నుంచి రూ.1.45లక్షలు, గుడిపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మరో వ్యక్తి వద్ద నుంచి రూ.70వేలు సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీలలో సిబ్బంది రాము, ఏడుకొండలు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



మిర్యాలగూడలో..

మిర్యాలగూడలో రూ.1.60లక్షలు..

మిర్యాలగూడ అర్బన్ : ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు మిర్యాలగూడ పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నందిపహాడ్ క్రాస్ రోడ్డులో ఓ వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకండా రూ.1.60 లక్షలు తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గోడుకొండ్లలో రూ.70వేలు..

చింతపల్లి : ఎన్నికల కోడ్ నేపథ్యంలో చింతపల్లి పోలీసులు ఎస్‌ఎస్‌టీ సభ్యులతో కలిసి గోడుకొండ్ల సమీపంలో చేపట్టిన వాహనాల తనిఖీలలో రూ.70వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా సుబ్బయ్యగూడేనికి చెందిన మారపోగు సుబ్బారావు నుంచి ఈ మేరకు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దోపిడీ కేసులో ఐదుగురి అరెస్టు

మిర్యాలగూడ అర్బన్ : దోపిడీ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ నాగార్జున ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడలోని రాఘవేంద్ర నగర్‌లో గల ఫ్లిప్‌కార్ట్ లిమిటెడ్ కంపెనీలో పట్టణానికి చెందిన పవన్ డెలవరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కొద్ది రోజులుగా పవన్ సరిగా డ్యూటీ రావడం లేదు. ఈ క్రమంలో కార్యాలయ ఓనర్ చామల బాలరాజు డ్యూటీకి ఎందుకు రావడంలేదని పవన్‌ను మందలించాడు. దీంతో ఓనర్‌పై పవన్ కక్ష పెంచుకున్నాడు. తనను తిట్టిన ఓనర్‌ను స్నేహితులతో చెప్పాడు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన పవన్‌తో పాటు అతడి స్నేహితులు ప్రశాంత్, రంజిత్, కిరణ్, గౌతంనందా అలియాస్ బన్నీ ఫ్లిప్ కార్డు కార్యాలయంలోకి చొరబడి మేనేజర్‌ను తీవ్రంగా కొట్టారు. అనంతరం క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.లక్ష నగదును దోపిడీ చేసి పారి పోయారు. ఆ సమయంలో కార్యాలయంలో ఉన్న సీసీ పుటేజీలో దాడి దృశ్యాలన్నీ రికార్డాయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా ఐదుగురు నిందుతులను గుర్తించి అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.లక్షను రికవరీ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

తెలంగాణ ఉద్యమంలో రచయితల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

- పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ గోపి

భువనగిరి రూరల్ : తెలంగాణ ఉద్యమంలో కవులు, రచయితల పాత్ర కీలకమని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ గోపి, పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. భువనగిరి పట్టణ శివారులోని రాయగిరిలో ఆదివారం భువన భారతీ, జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాలు, కవి సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. సాహిత్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఎందరో కవులు జాతీయ స్థాయిలో రాణించారన్నారు. నిజాన్ని నిక్కచ్చిగా చెప్పడం కవులు, కళాకారులు, రచయితలు వెనుకాడొద్దన్నారు. అనంతరం పెసర వేణుగోపాల్ రెడ్డి, ఎస్‌ఎన్ చారి, కస్తూరి లక్ష్మి నారాయణ, మోత్కూరి నరహరి, కొలుపుల అమరేందర్, బట్టు రాంచంద్రయ్య, సద్ది వెంకట్‌రెడ్డి, సోమ సీతారాములు, గడ్డం నర్సింహారెడ్డి, పెండెం సత్యనారాయణ, చల్ల జయశ్రీలకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి రాంమూర్తి, బండిరాజుల శంకర్, పెసరు లింగారెడ్డి, గుమ్మడెల్లి వెంకన్న, వాకిటి రాంరెడ్డి, వల్లాల విజయలక్ష్మి, మోటె సత్తయ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించిన ఈఓ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖ మండపంతో పాటు ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థను ఈఓ భాస్కర్‌రావు పరిశీలించారు. ఆదివారం శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఈఓ క్యూలైన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంతో పాటు ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీ నుంచి దుర్వాసన వస్తుందని తెలిపారు. దీంతో వెంటనే వైటీడీఏ, ఆర్‌అండ్‌బీ అధికారులు, ఆలయాధికారులతో కలిసి ముఖ మండపం, ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన డ్రెయినేజీలను పరిశీలించి, దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈఓ వెంట ఆర్ అండ్ బీ అధికారులు వసంత్‌నాయక్, వెంకటేశ్వర్లు, ఆలయాధికారులు దోర్బల భాస్కర్‌శర్మ, దయాకర్‌శర్మ, రాకేష్ తదితరులున్నారు.



ఆలయ ముఖ మండపంలో డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఈఓ, అధికారులు

వ్యక్తి అదృశ్యం



పొట్టేటి భిక్షం

రామన్నపేట: ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని తుమ్మలగూడెం గ్రామానికి చెందిన పోట్టేటి భిక్షం(65) గత నెల 24న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భిక్షం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ఆత్మకూరు(ఎం): రాయిగిరి–మోత్కూరు ప్రధాన రోడ్డుతో పాటు జిల్లాలో ప్రధాన రోడ్లపై ప్రమాదాలకు చెక్ పెట్టేదుకు ఆర్‌అండ్‌బీ శాఖ చర్యలు చేపట్టింది. ఇందు కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలకు, చెట్టు కొమ్మలకు ట్రీ బ్యాండింగ్ చేశారు. దూరం నుంచి వస్తున్న వాహనాలకు చెట్లు స్పష్టంగా అగుపిస్తాయి. ట్రీ బ్యాండింగ్ అంటే చెట్టు మొదలుపై వైట్ పేయింట్‌తో రెండు గీతలు, వాటి మధ్యలో జాజుతో ఒక గీతను పేయి ంట్ చేస్తారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా చెట్లకు ట్రీ బ్యాండింగ్ , కల్వర్టులకు వైట్ పేయింటి ంగ్ వేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ షహనాజ్ చెప్పారు.



చెట్టుకు చేసిన ట్రీ బ్యాండింగ్

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అనంతరం మహాసౌర హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో కాకులారపు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరాలయంలో రుద్రాభిషేకం

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులో శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ఉమామహేశ్వరాలయంలో స్వామివారికి ఆదివారం వేద పండితులు రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, బందకవి కృష్ణమోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రుద్రాభిషేకం చేస్తున్న వేద పండితులు

ఒక వైపు చదువు.. మరోవైపు శిక్షణ

- ఆర్మీ శిక్షణలో రాణిస్తున్న విద్యార్థులు
- బీబీనగర్ మండలంలోని లక్ష్మీదేవిగూడెంలో మొదటి ఆర్మీ డిగ్రీ కళాశాల
- కళాశాలలో సీటు పొందేందుకు తీవ్ర పోటీ



లక్ష్మీదేవిగూడెంలోని ఆర్మీ కళాశాల

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలలో ఇస్తున్న శిక్షణలో విద్యార్థులు రాణిస్తున్నారు. కళాశాలలోని డిగ్రీ విద్యార్థులకు బోధనతో పాటు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వివిధ త్రివిధ దళాల్లో దేశ రక్షణకు పాలుపంచుకునే విధంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలను 2018కి ముందు మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాల భవనంలో ఏర్పాటు చేశారు. ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేని ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలను లక్ష్మీదేవిగూడెంలో ఏర్పాటు చేశారు. ప్రతి రోజు డిగ్రీ కోర్సులకు సంబంధించి బోధన చేయడంతో పాటు శిక్షణకు సైతం ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు.

ఆర్మీ అధికారులతో..

కళాశాలలోని విద్యార్థులకు డిగ్రీ కోర్సులతో పాటు ఆర్మీ అధికారులతో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం కర్నల్ రాకేష్ చౌహాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. రోజు ఉదయం 4గంటల నుంచి 7గంటల వరకు ఆర్మీ శిక్షణ ఇవ్వగా మధ్యాహ్నం 6గంటల వరకు డిగ్రీ కోర్సులకు సంబంధించి బోధన చేస్తున్నారు. అనంతరం 5గంటల నుంచి మరోమారు శిక్షణ ఇస్తున్నారు. కళాశాలలోని శిక్షణ కోసం ప్రత్యేకంగా పరికరాలను, జిమ్‌ను ఏర్పాటు చేశారు, కళాశాలలోని డిగ్రీ కోర్సులకు సంబంధించి ఎంపీసీ, ఎంఎ, బీజెడ్సీ, బీఏ, బీకాం కోర్సులు కొనసాగుతున్నాయి, చదువుతో పాటు దేశ స్థాయిలో ఉద్యోగాలు పొందే దిశగా కళాశాల ఉండడంతో 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. కళాశాలలో సీటు పొందేందుకు తీవ్ర పోటీ నెలకొంది.



ఆర్మీ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సద్వినియోగం చేసుకోవాలి

దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఏర్పాటైన సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలలో కల్పిస్తున్న ఆర్మీ శిక్షణ, డిగ్రీ కోర్సుల బోధనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పొందిన విద్యార్థులకు ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, పారామిలటరీ, నేవీ, పోలీస్ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.

– పాండురంగ శర్మ, కళాశాల ప్రిన్సిపాల్



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సీపీఎంకు మద్దతు ఇవ్వాలి

రామన్నపేట : నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేసే సీపీఎంకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. రామన్నపేటలో ఆదివారం జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి జహంగీర్ విజయం సాధిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాడని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్ రెడ్డి, కల్లూరి మల్లేషం, జగదీష్, ఆనగంటి వెంకటేశం, మండల కార్యదర్శి బోడ్డుపల్లి వెంకటేశం, ఎంపీపీ నాగటి ఉపేందర్, వనం ఉపేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి ఉపేంద్ర, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

నాగారం : ఎన్నికల నియమావళిని ఉల్లంగించి బెల్ట్ షాపులో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మద్యాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోకుంటే దిగుబడిపై ప్రభావం

- ఆయిల్ పామ్ సాగుపై పెద్దవూర మండల ఉద్యానవన అధికారి రవినాయక్ సూచనలు



రవినాయక్, మండల ఉద్యానవన అధికారి, పెద్దవూర

పెద్దవూర: గత ప్రభుత్వం ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రైతులకు సబ్సిడీపై మొక్కలను అందించటంతో జిల్లా వ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మండుతున్న ఎండలకు ప్రస్తుత సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో పంట ఎదుగుదల, దిగుబడిలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పెద్దవూర మండల ఉద్యానవన అధికారి బి.రవినాయక్ తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలను ఉంచుకుని కొత్తగా వేసిన, ఎదిగిన పంట పెరుగుదలను కాపాడుకుంటూ, పంట పరిస్థితిని బట్టి రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగు చేపట్టాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని పేర్కొన్నారు.



పెద్దవూరలో సాగు అవుతున్న ఆయిల్‌పామ్ తోట

- ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయస్సు ఉన్న ఆయిల్ పామ్ తోటల్లో మొక్కకు మూడు అడుగుల దూరంలో జనుమును, పచ్చిరొట్ట ఎరువు పంటగా నాటుకోవాలి. జనుము పూతకు వచ్చిన వెను వెంటనే చిన్న, చిన్న ముక్కలుగా కోసి పాదులో చుట్టూ వేయాలి.



- ప్రతి మొక్కకు రెండువైపులా ఒక్కో మైక్రోజెట్(30 లేదా 40 లీటర్లు డిశ్చార్జ్ అయ్యేవి) అమర్చుకోవాలి.
- వేసవిలో చిన్న మొక్కలకు రోజుకు 150–165 లీటర్ల నీటిని అందించాలి. చెట్టుకు ఇరుపక్కల జెట్‌కు గంటకు 40 లీటర్ల సరఫరా సామర్థ్యం ఉన్నట్లైతే రోజుకు రెండు గంటలు నీరు అందించాలి. ఎదిగిన ఆయిల్‌పామ్ తోటల్లో వేసవి కాలంలో ప్రతి చెట్టుకు రోజుకు 250–330 లీటర్ల నీటిని అందించాలి.
- మూడేళ్ల లోపు వయస్సు ఉన్న మొక్కల్లోని పూగుత్తులను ప్రతి నెల అబ్లెషన్ సాధనంతో(రెండుసార్లు) తొలగించాలి.
- అవసరం మేరకు మాత్రమే(అన్ని చెట్లు కాకుండా) ఎండిన, విరిగిన లేదా చీడపీడలు ఆశించిన ఆకులను మాత్రమే తొలగించాలి.
- తోటల్లో అంతర పంటలు వేసినట్లయితే ఆయిల్‌పామ్ మొక్కలతో పాటు అంతర పంటలకు కూడా సిఫారసు మేరకు నీరు తప్పనిసరిగా అందేలా చూసుకోవాలి.
- ఆయిల్‌పామ్ రైతుల, రైతు డైరీలలో సిఫారసు చేసిన పద్ధతిలో పోషకాలను తప్పనిసరిగా అందించి అట్టి వివరాలను రైతు డైరీల్లో నమోదు చేయాలి.
- ఎదిగిన ఆయిల్‌పామ్ తోటల్లో గెలలు కోసిన తరువాత నరికి ముక్కలు చేసిన ఆయిల్‌పామ్ ఆకులను, మగ పూల గుత్తులను, మొక్కజొన్న చొప్పను, ఖాళీ అయిన ఆయిల్‌పామ్ గెలలను, పాదుల్లో మల్చింగ్‌గా పరచాలి.
- ఎదిగిన ఆయిల్‌పామ్ తోటల్లో పక్వానికి వచ్చిన ప్రతి గెలను, అల్యూమినియం కడ్డీ లేదా కత్తిని ఉపయోగించి కోయాలి.

- ఎదిగిన ఆయిల్‌పామ్ తోటలకు నెలకు ఎకరాకు 5కిలోల యూరియా, 3కిలోల డీఏపీ, 5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 2.5 కిలోల మెగ్నీషియం సల్ఫేట్‌ను, ఒక కిలో బోరాక్స్‌ను విడివిడిగా నీటిలో కరిగించి ఫర్టిగేషన్ ద్వారా మొక్కలకు అందించాలి. ఇలా చేయడం వలన సమయం, ఎరువులపై ఖర్చు కూడా ఆదా చేయవచ్చు.
- ఆయిల్‌పామ్ తోటల్లో ఎక్కువగా పోషక లోపాలు కనిపించినట్లైతే మట్టి, పత్ర విశ్లేషణ కొరకు నమూనాలను సిఫార్సు చేసిన రీతిలో సేకరించి విశ్లేషణ కొరకు పంపాలి.